ఎస్‌ఐ నియామకం జరిగేదెప్పుడు?

- శాంతి భద్రతలను కాపాడేదెవరూ?
- రాత్రివేళల్లో కొరవడిన పర్యవేక్షణ
- యథేచ్ఛగా చోరీలు, దాడులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ లేకపోవడంతో శాంతిభద్రతలు అదుపుతప్పుతున్నాయి. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ శివప్రసాద్ ఐదు నెలల కిందట వేరే ప్రాంతానికి బదిలీపై వెళ్లారు. పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ లేకపోవడంతో శాంతి భద్రతలను కాపాడేవారు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిమిట్ట మండలానికి సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాళీని భర్తీ చేసే విషయంలో ఉన్నతాధికారులు ఎందుకు జాప్యం చేస్తున్నారో అర్థంకావడం లేదంటూ మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి క్షేత్రం ఉండటంతో నిత్యం ప్రొటోకాల్ సమస్య, టీడీపీ వర్గపోరు కారణంగా ఎవరికీ మద్దతు ఇవ్వాలనే తలనొప్పి ఉంటుందనే



ఒంటిమిట్ట పోలీసు స్టేషన్

ఆలోచనలో ఇక్కడ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఎస్‌ఐని నియమించాలి

జాతీయ రహదారిపై ఒంటిమిట్ట ఉండడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. నేరాల దర్యాప్తులో ఎస్‌ఐ పాత్ర కీలకంగా ఉంటుంది. నిత్యం ఒంటిమిట్టకు రాజకీయ నాయకులు, వీఐపీలు వస్తుంటారు. పర్యటనకు వచ్చిన వారి రక్షణ, ప్రొటోకాల్ పర్యవేక్షణలో ఎస్‌ఐ పాత్ర కీలకం. ఎస్‌ఐ లేకపోవడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేర చరిత్ర కలిగినవారిపై నిఘా కొరవడింది. ఈ నేపథ్యంలో ఐదు నెలలుగా సబ్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించకపోవడంతో శాంతి భద్రతలను ఎవరు కాపాడుతారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంత సుదీర్ఘకాలం ఒంటిమిట్ట పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడం ఇదే మొదటిసారి.

చెలరేగిపోతున్న దొంగలు

పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనాలు, హత్యలు, అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో దొంగతనాలు జరిగాయి. రాత్రిళ్లు పోలీసు బీట్‌కు సంబంధించి సబ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఒంటిమిట్ట మండలంలో సబ్ ఇన్‌స్పెక్టర్ నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఎయిడ్స్‌ను తరిమికొడదాం


పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రజా చైతన్య సేవాసంస్థ సభ్యులు

లక్కిరెడ్డిపల్లి: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని ప్రజా చైతన్య సేవాసంస్థ కో–ఆర్డినేటర్ వరలక్ష్మీ దేవి, సీవీ రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం దేవళంపల్లి, లక్కిరెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలలో ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఎయిడ్స్ నివారణపై ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు బానిక కాకూడదని, డ్రగ్స్ వాడటంకు దూరంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను ఆదరించాలన్నారు. సమాజంలో ఎయిడ్స్, క్షయ వ్యాధిపై అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు రమణారెడ్డి, సీతారామ, సుబ్బలక్ష్మీ దేవి, ఎస్ఎస్ఓఆర్ డబ్ల్యు అలేఖ్య, పిఈ లక్ష్మీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

డెంగీ కేసు గుర్తింపు


నీటితొట్టిని పరిశీలిస్తున్న వైద్య బృందం

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు పంచాయతీ, సాతుపల్లిలో డెంగీ కేసు నమోదు కావడంతో శుక్రవారం వైద్య సిబ్బంది గ్రామంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఓ కుటుంబంలో జ్వరం రావడంతో కడప రిమ్స్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించగా డెంగీ అని తేలిందని, దీంతో డివిజనల్ మలేరియా అధికారి ఎస్ఎస్ దాసు, మెడికల్ ఆఫీసర్ షేక్ సిరియా ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. అలాగే క్యాంపు నిర్వహించి అక్కడ వైద్యం కూడా అందించారు. ప్రతి ఇంటికీ వైద్య సిబ్బంది లార్వా సర్వే ఫీవర్ పై సర్వే చేసి అబెట్ ద్రావణంతో పిచికారి చేయించారు. మలేరియా, డెంగీ, బోదకాలు, చికెన్ గున్యా జ్వరాలు రాకుండా ఇంటిలో నిల్వ ఉన్న నీటిని వారానికి ఒకసారి కచ్చితంగా శుభ్రపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మస్తాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ


సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలానికి 19.8 మెట్రిక్ టన్నులు యూరియా మంజూరైందన్నారు. టక్కోలు రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నులు, సిద్దవటం రైతు సేవా కేంద్రానికి 9.9 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చిందని తెలిపారు.

అవార్డు ప్రదానం


ఐ. శ్రీవాణిని అభినందిస్తున్న చాన్సలర్ గంగిరెడ్డి, అధ్యాపకులు

రాజంపేట: అన్నమాచార్య యూనివర్సిటీలో హెచ్‌అండ్ఎస్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఐ. శ్రీవాణికి సైంటిఫిక్ ఇంటర్నేషనల్ పబ్లిసింగ్ హౌస్ ఆధ్వర్యంలో అకడెమిషియన్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ చాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, శ్రీవాణిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి ఇలాంటి నిబద్ధత కలిగిన అధ్యాపకులు ఎంతో అవరమని అన్నారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ సాయిబాబా రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ మల్లికార్జున రావు, వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ, హెచ్ఎండ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎల్ ఓబులపతి, అధ్యాపకులు డాక్టర్ ఐ శ్రీవాణిని అభినందించారు.

డీడీఓకు సన్మానం


డీడీఓను సన్మానిస్తున్న సిబ్బంది

సంబేపల్లె : పదోన్నతిపై కుప్పం డీడీఓగా బదిలీపై వెళ్లిన ఎన్. రామచంద్రకు శుక్రవారం సంబేపల్లె ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. మండల అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన ప్రదర్శించిన చొరవను మరచిపోలేమని సిబ్బంది పేర్కొన్నారు.

తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ తనిఖీ

మదనపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను జిల్లా కో ఆర్డినేటర్ భార్గవాచారి శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి.. ప్రసవానంతరం తల్లిబిడ్డలను స్వగ్రామాలకు తరలిస్తున్న వివరాలను, డ్రైవర్లను అడిగి తెలుసుకున్నారు. వాహనాల కండీషన్, డ్రైవర్ల పనితీరును పరిశీలించారు.

సైద్ధాంతిక మానవతావాది ఏచూరి

రాయచోటి టౌన్ : సైద్ధాంతిక విలువలు పాటిస్తూనే ఇతర రాజకీయ పార్టీల నాయకులతో సత్సంబంధాలు నెరపిన మానవతావాది సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఏ. రామాంజులు అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకొని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ సీతారాం దోపిడీ, సామాజిక వివక్షలేని భారతదేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థి దశలోనే ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ తీవ్రంగా వ్యతిరేకించి ప్రజాస్వామ్య హక్కుల కోసం నిలబడిన వ్యక్తి ఏచూరి అని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ రద్దుకోసం ప్రతి


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

ఒక్కరికి ఉపాధి కల్పించి జీవన భద్రత కోసం చివరి వరకు పోరాడిన మానవతావదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.భాగ్యలక్ష్మి, కవిత, మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు బీవీ రమణ, ఉపాధ్యక్షులు చెన్నయ్య, శంకరయ్య, దేవ, సాయి రామకృష్ణ, సీఐటీయూ నాయకులు రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత సామాజిక బాధ్యత


రాజంపేట రూరల్: మాట్లాడుతున్న డీసీపీఓ వినోద్


గాలివీడు : కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

రాజంపేట రూరల్: మహిళల భద్రత సామాజిక బాధ్యత అని డీసీపీఓ వినోద్ తెలియజేశారు. స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ డివిజన్ స్థాయి సమావేశాన్ని సీడీపీఓ సునంద అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీలకు చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీఓ వినోద్‌తో పాటు సీడీపీఓ సునంద, మెడికల్ ఆఫీసర్ వికాస్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. పనిచేసే ప్రదేశాల్లో మహిళలను లైంగికంగా వేధించటం చట్టరిత్యా నేరమని చెప్పారు. కార్యక్రమంలో రాజంపేట, నందలూరు, పెనగలూరు ప్రాజెక్టు పరిదిలోని అంగన్‌వాడీ సూపర్ వైజర్‌లు, అంగనవాడీలు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

గాలివీడు : యువతులు, మహిళలు ప్రతి ఒక్కరూ మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శారదమ్మ, సోనీ, సుజాతా రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టివీడు గ్రామంలో మహిళలకు రక్షణగా ఉన్న చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, కిశోరీ బాలికలపై లైంగిక వేధింపులు, పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రతపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం శివమ్మ, ఆశావర్కర్ రామాంజులమ్మ, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టాలు తేవాలి

రాయచోటి టౌన్ : ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రక్షణ చట్టం లాగానే బీసీలకు కూడా రక్షణ చట్టాన్ని తీసుకురావాలని అన్నమయ్య జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఇడగొట్టు నాగేశ్వరావు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు దోపిడీకి గురవుతూ అన్ని రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో తాము అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక చట్టాన్ని తీసుకొస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించారని పేర్కొన్నారు. అలాగే చట్టసభల్లో 33శాతం, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు పరుస్తామని అని కూడా వాగ్దానం చేశారని చెప్పారు. రాజ్యాంగం పరమైన చిక్కులన్నింటీని అధికమించి బీసీలకు 34శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. నియోజకవర్గ అధ్యక్షులు సంచుల ఖాదర్ బాషా, యువజన సంఘం జిల్లా నాయకులు నాగార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నాయకులు

భూ కబ్జాలు అడ్డుకోవాలని వినతి

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని చిన్నఓరంపాడు రెవెన్యూ పరిధిలోని పున్నాటివారిపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 319లో స్థానిక టీడీపీ నాయకులు శుక్రవారం జేసీబీలు, యంత్రాలతో కబ్జాలకు పాల్పడ్డారని, వారిని అడ్డుకోవాలని పొన్నాటి సుబ్రహ్మణ్యం, పొన్నాటి ఈశ్వర్‌రెడ్డి తహసీల్దార్ యామినిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 319 సర్వే నెంబర్లు సబ్ డివిజన్‌పై తమ కుటుంబ సభ్యుల పేర దాదాపు 20 ఎకరాల భూమి ఉందని, ఇందుకు సంబంధించి వన్‌బీ పాస్ పుస్తకాలు, రికార్డులు తమ పేరుపై ఉన్నాయని, సహకార బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లలో దాదాపు రూ.16 లక్షలు మేర రుణాలు తీసుకున్నామని తెలిపారు.


రైతులు ఇచ్చిన వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

అయితే స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు జేసీబీలతో సర్వే నంబర్లు కబ్జాలకు పాల్పడుతున్నారని, వారిని అడ్డుకుని న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగునీరు ఇవ్వండి సారూ!

సిద్దవటం : తాగేందుకు, వాడుకునేందుకు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ మండలంలోని జంగాలపల్లి గ్రామ పంచాయతీ, కమ్మపాలెం ఎస్సీ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో మూడు నెలలుగా తాగునీటి సోలార్ సిస్టమ్ పనిచేయక తాగునీరు రావడం లేదని కాలనీ వాసులు శుక్రవారం వాపోయారు. తరచూ నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని దాదాపు ఒక కిలోమీటర్ పరిధిలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి, గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంకు వద్ద తాగునీరు తెచ్చుకుంటున్నామని, తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని కాలనీ వాసులు కోరారు. ఈ విషయమై స్థానిక పంచాయతీ సెక్రటరీ జానకీని వివరణ కోరగా కమ్మపాలెం గ్రామం, ఎస్సీ కాలనీలో తాగునీటి సోలార్ సిస్టమ్ పనిచేయత తాగునీటి సమస్య ఉండటం వాస్తవమేనని సోలార్ సిస్టమ్‌కు సంబంధించిన మెకానిక్ జిల్లాకు ఒకరు మాత్రమే ఉన్నారని, ఒక వారంలోపు తాగు నీటి సమస్యను గ్రామ సర్పంచ్ అధ్యక్షతన పరిష్కరిస్తామని చెప్పారు.


కమ్మపాలెం ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్: రాజంపేట పట్టణం, మండల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజంపేట టౌన్‌తో పాటు సరస్వతీపురం, తాళ్లపాక సబ్‌స్టేషన్‌లోని11కేవీ ఫీడర్‌కు సమీపంలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

వైద్య విద్యపై ప్రభుత్వం కుట్రలు

రాయచోటి టౌన్: విద్య వైద్యం పేద, మధ్య తరగతి విద్యార్థులకు దూరం చేయాలని కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వైఎస్సార్ సీపీ మహిళ విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కోట్లు అర్జించడం కోసమే ప్రైవేట్ వ్యక్తులకు మెడికల్ కళాశాలలను అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పిన దానికి అధికారంలోకి వచ్చిన తరువాత చెప్పే మాటలకు పొంతన లేదని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ హయాంలో మంజూరైన మెడికల్ కళాశాలను కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని మేధావులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఈ నిర్ణయం వైద్య విద్య పేదలకు దూరం చేయాలని చర్యగా పరిగణిస్తున్నామన్నారు. జగనన్న ముఖ్యమంత్రిగా వచ్చే నాటికి రాష్ట్రంలో ఎంబీబీఎస్ సీట్లు 2,360 సీట్లు మాత్రమేనన్నారు. జగనన్న వచ్చాక మరో 2550 సీట్లు పెరిగి 4,910 సీట్లకు పెరిగిందని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి, కడప రహదారిలో శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. అనంతరం సిద్దవటం మండల తహశీల్దార్‌కు అప్పచెప్పామని, కొన్ని పల్లె ప్రాంతాలలో ఇసుక డంపింగ్ ఉన్నట్లు సమాచారం ఉందని, వాటిపై నిఘా పెట్టి అక్రమ ఇసుక రవాణ జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి


ఎం. చంద్ర కుళాయప్ప

ఓబులవారిపల్లె: పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జనరల్ సెక్రటరీ ఎం. చంద్ర కుళాయప్ప తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఐటీ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎం. చంద్ర కుళాయప్పను నియమిస్తున్నట్లు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. చంద్ర కులాయప్ప మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో తనకు కేటాయించిన బాధ్యతను సమర్ధవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మదనపల్లె రూరల్: ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని టూటౌన్ సీఐ రాజారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని డిగ్రీ, జూనియర్ కాలేజీల వద్ద శుక్రవారం సీఐ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న, మోటార్ బైక్‌లను శబ్దం చేసుకుంటూ, వేగంగా నడుపుతున్న విద్యార్థులను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఐ రాజారెడ్డి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులపై పోలీసులకు సమాచారం అందిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థులు, యువత చదువు, కెరీర్‌పై దృష్టి పెట్టి చక్కగా చదువుకోవాలని, ఘర్షణలు, గొడవల్లో తలదూర్చి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హెచ్చరించారు.

రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

పెనగలూరు: రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం అనంతంపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ రైతులకు తగినంత ఎరువులు సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎరువుల కోసం రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువులను ప్రైవేటుగా కొనుగోలు చేయాలంటే అత్యధిక ధరలకు విక్రయిస్తుండటంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇబ్బందులు లేకుండా రైతులకు సకాలంలో ఎరువులు అందించారని పేర్కొన్నారు. ఎరువులు లేకుంటే పంటలు సక్రమంగా పండవని, రైతులకు ఇబ్బందులు లేకుండా వెంటనే ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నివాళి

గీతాపారాయణం గురువు అయిన రామచంద్రయ్య మృతి చెందడంతో ఆయన పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రామచంద్రయ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పొందలూరు మాజీ సర్పంచ్ ఆంజనేయులు రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, నరసారెడ్డిలతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దాం

పుల్లంపేట: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మారుద్దామని ఎంపీడీఓ జయశ్రీ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని పీవీజీపల్లి, జాగువారిపల్లి గ్రామ పంచాయతీలలో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రైతులకు డ్రోన్ సబ్సిడీ ద్వారా అందజేశామని తెలిపారు. రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ఒకే రకమైన పంటను పండించడం వల్ల నేల నిస్సారంగా తయారవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పొలంలో భూసార పరీక్షలు ఆధారంగా మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు. తద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గి ఆదాయం పెంచుకోవచ్చని తెలిపారు. అలాగే కొత్త తరహా ఎరువులను నానో యూరియా, జీవన ఎరువులను ఆసక్తి కల్గిన రైతులు ముందుకు వచ్చి డ్రిప్ డ్రోన్ దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అభ్యుదయ రైతు చంద్రశేఖర్ నాయుడు, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అందరి భాగస్వామ్యంతోనే మలేరియా నిర్మూలన

గాలివీడు : మలేరియా నిర్మూలన అందరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతోందని డాక్టర్ శ్వేత భాను ప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం నూలివీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విషజ్వరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య మాట్లాడుతూ దోమకాటు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాప్తిని కొద్దిపాటి జాగ్రత్తలతో అరికట్టవచ్చన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఫ్రైడే డ్రైడేలో భాగంగా స్థానిక పీహెచ్‌సి సిబ్బందితో కలిసి ఇంటింటి లార్వా సర్వే నిర్వహించామని తెలిపారు. వైద్య సిబ్బంది మలేరియా లక్షణాలు ఉన్న రోగులకు పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం అందించాలని అన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. తీవ్ర జ్వరం, చలి, తలనొప్పి, నీరసం ,వాంతులు, రక్త కణాలు తగ్గిపోవడం, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే రక్త పరీక్షలు చేయించుకుని తగిన చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్య కార్యకర్తలు కె.కవిత,అహ్మద్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది, స్థానికులు

'మన మిత్ర డోర్ టు డోర్ డెలివరీ' బహిష్కరిస్తాం

ఒంటిమిట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5న మన మిత్ర డోర్ టు డోర్ డెలివరీ కార్యక్రమానికి సంబంధించి అధికారికంగా విడుదల చేసిన ఆదేశాలకు సంబంధించి ఆవేదన వ్యక్తం చేస్తూ మన మిత్ర డోర్ టు డోర్ కార్యక్రమాన్ని రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక (ఏపీవీడబ్ల్యూఎస్ఈ జేఏసీ) పిలుపు మేరకు బహిష్కరించబోతున్నట్లు ఒంటిమిట్ట మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు తెలిపారు. శుక్రవారం మన మిత్ర డోర్ టు డోర్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కడప జిల్లా జేఏసీ జనరల్ సెక్రటరీ చిన్న మస్తాన్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సుజాతకు సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. అనంతరం చిన్నమస్తాన్ మాట్లాడుతూ సాధ్యం కాని పనులను అప్పగించడంపై రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు హరికృష్ణ, సురేంద్ర, కమాల్ భాష, మస్తాన్, లావణ్య, దీపిక, లక్ష్మీకళ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

సిద్దవటం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని ఎంఎల్‌హెచ్‌సీ జాస్మిన్ అన్నారు. మాచుపల్లి పంచాయతీ, తురకపల్లిలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లి గ్రామ పరిధి, శాంతి నగర్, తురకపల్లి తదితర గ్రామాలలో సీజనల్ వ్యాధులు పట్ల ప్రతి గృహాన్ని సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఎంఎల్‌హెచ్‌సీ జాస్మిన్ మాట్లాడుతూ పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచన మేరకు పలు ప్రాంతాలలో అపరిశుభ్రత ప్రాంతాలను గుర్తించి దోమలు నివారణ కొరకై అబిట్, బ్లీచింగ్ పిచికారి చేయించామని, సీజన్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మందులు ఇచ్చామని తెలిపారు. ఆరోగ్య కార్యకర్త వాసవీ, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పొన్నవోలు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో నీటి నిల్వ ఉన్నచోట లార్వా వృద్ధి చెందకుండా అబేట్ ద్రావణాన్ని చల్లించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని తెలిపారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్స చేయించుకోవాలని కోరారు. హెల్త్ సూపర్ వైజర్ మౌలాలి, ఏఎన్ఎం శారద, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

పీలేరురూరల్: పుల్లంపేట సీపీఐ మండల కార్యదర్శి సెల్వకుమార్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని సీపీఐ జిల్లా జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సాంబశివ, పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్.వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ పుల్లంపేట మండలం దలవాయిపల్లె పంచాయతీలో ప్రభుత్వ ఆక్రమణపై సెల్వకుమార్ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారన్నారు. సాయికుమార్‌రెడ్డి, అతని అనుచరులు అర్ధరాత్రి సమయంలో సెల్వకుమార్ ఇంట్లో చొరబడి ఆయనపై దాడిచేశారన్నారు.

ముంపు గ్రామాలు.. వీడని కష్టాలు

ఒంటిమిట్ట: మండల పరిధిలోని పెన్నపేరూరు, తప్పెటవారిపల్లె గ్రామాల్లో గృహాల వద్దకు శుక్రవారం సోమశిల బ్యాక్ వాటర్ వచ్చి చేరుతోంది. అయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా ఈ గ్రామ ప్రజలు తమ వ్యవసాయ భూములకు నష్టపరిహారం చెల్లించారని, గృహాలకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ముంపు వాసుల గోడు పట్టించుకునేవారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుంటే సోమశిల వెనుక జలాలు తమ గ్రామాలలోకి చొచ్చుకు వస్తాయని వారు పేర్కొంటున్నారు. తమ ఆవేదనను గ్రహించి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని తప్పెటవారిపల్లె, పెన్నపేరూరు గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.


పొలాల్లో సోమశిల బ్యాక్ వాటర్